సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 31 । మే । 2025



రూ.1,00,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి నడింపల్లి ఎస్‌వీఎస్ రాజు, నాగదేవి దంపతులు (బెంగళూరు) శుక్రవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.




చెరువు గుటాయస్వాహా!

ఆక్రమణకు కాదేదీ అనర్హం అన్నట్లు కొందరు రెచ్చిపోతున్నారు. ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపిస్తుందా.. పాగా వేసేద్దామా అంటూ ఎదురుచూస్తున్నారు.

10లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 10,650 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.15 అడుగులు చేరింది. డెల్టా కాలువలకు నీరు విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

రైల్వే లైన్‌పై హామీని నిలబెట్టుకోవాలి

పనుల నత్తనడకపై కోనసీమ జేఏసీ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ రామమోహనరావు

అమలాపురం టౌన్: గత ఎన్నికల ప్రచారం సందర్భంగా అమలాపురం సెంటర్‌లో జరిగిన సభలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తమ తమ ప్రసంగాల్లో కోనసీమ రైల్వే లైనును తాము అధికారంలోకి వస్తే తొందరగా పూర్తి చేస్తామని హామీలు ఇచ్చారని కోనసీమ జేఏసీ కన్వీనర్ బండారు రామమోహనరావు గుర్తు చేశారు. స్థానిక జేఏసీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశం రైల్వే లైన్ పనులపై సమీక్షించింది. జేఏసీ కన్వీనర్ రామమోహనరావు మాట్లాడుతూ ఇచ్చిన హామీని ఈ కూటమి ప్రభుత్వంలో నిలబెట్టుకోవాలని సూచించారు. ముమ్మిడివరం నియోజకవర్గ పర్యటనకు శనివారం వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు కోనసీమ రైల్వే లైన్ పనులపై స్పందించాలని డిమాండ్ చేశారు. లైన్ నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని చెప్పారు. కోటిపల్లిలో గౌతమి నదిపై నిర్మించిన రైల్వే వంతెన పిల్లర్స్‌పై గడ్డర్స్ వేయడానికి టెండర్లు ఖరారు అయినప్పటికీ ఇంకా పనులు ప్రారంభం కాలేదన్నారు. జేఏసీ ప్రతినిధులు డాక్టర్ రాయుడు శ్రీరామచంద్రదమూర్తి, కరాటం ప్రవీణ్, కల్వకొలను బాబు, జంగా రాజేంద్ర, ఎస్.సంసోను, మాచిరాజు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్యమైన జీవనానికి యోగా



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: ఆరోగ్యకరమైన జీవన విధానానికి యోగాను దైనందిన జీవితంలో ఒక భాగంగా అలవర్చుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ 26 జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించి 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణ, ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అమలు తీరు, ప్రజా సంతృప్తి స్థాయిల పురోగతి, అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం నిర్వహణ అంశాలపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యోగా ట్రైనర్లను గుర్తించామని, వారితో అన్ని ప్రాంతాలలోని ప్రజలతో యోగాభ్యాసన చేయించడంతో పాటు, యోగా పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో 8 లక్షల రిజిస్ట్రేషన్లు లక్ష్యంగా నిర్దేశించారని తెలిపారు. గ్రామ ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంపై సమీక్షిస్తూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 10 వేలు కనెక్షన్లు ఇవ్వడం లక్ష్యమన్నారు. ఆ మేరకు ట్రాన్స్‌కో అధికారులు, బ్యాంకర్ల సమన్వయంతో రాయితీలతో ప్రోత్సహిస్తూ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. జేసీ టి.నిషాంతి, అధికారులు పాల్గొన్నారు.



గడపగడపకూ చేరని సంక్షేమం

- కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఒకవైపు సంక్షేమ పథకాల ఎత్తివేత
- మరోవైపు సామాన్యుల సేవలకు దూరం
- వలంటీర్లను నిలిపివేశారు
- ఇక ఇంటి వద్ద రేషన్ లేనట్టే... ఇంటి ముంగిట అందని వైద్యం
- కూటమి ఏడాది పాలనలో అన్నీ కష్టాలే
- నాడు ప్రభుత్వం వరంగా ఏం కావాలన్నా గుమ్మాల వద్దకే..
- నాటి పరిస్థితులు గుర్తు చేసుకుంటున్న జనం

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

సాక్షి, అమలాపురం: సంక్షేమ పథకాల లబ్ధి సకాలంలో అందించడం... పదుల సంఖ్యలో సేవలను సామాన్యులకు చేర్చడం.. వలంటీర్లు ఇళ్ల వద్దకు వచ్చి పింఛన్లతోపాటు పలు పథకాల్లో లబ్ధి చేకూరేలా పనిచేయడం .. పంట నష్టపోతే తరువాత రోజే రైతు ఇంటికి వచ్చి పంట నష్టం నమోదు చేయడం.. పంట యాజమాన్యం గురించి రైతులకు చెప్పే రోజులకు కాలం చెల్లిపోయింది. ఇంటింటికీ వచ్చి ఆరోగ్యం గురించి క్షేమ సమాచారం తెలుసుకునే ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు.. ఇలా చెప్పుకుంటూ పోతే గత ఐదేళ్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మూడొంతుల ప్రభుత్వ సేవలు గడప వద్దనే అందేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పరిస్థితి మొత్తం మారిపోయింది. వలంటీర్ వ్యవస్థ నిలిచిపోయింది. సచివాలయంలో మూడొంతుల సేవలు ఆగిపోయాయి. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను దాదాపు ఎత్తివేసిన ప్రభుత్వం.. సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్ల నిర్మాణ పనులను నిలిపివేయడం ద్వారా ఈ వ్యవస్థలను పక్కనబెట్టేందుకు సిద్ధమవుతోంది.

నాడు

ప్రశంసలు పొందిన సేవలు



సఖినేటిపల్లి మండలం మోరిలో దివ్యాంగుడికి పింఛన్ పంపిణీ (ఫైల్)

- గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా పట్టణ, గ్రామ ప్రజలకు, రైతులకు, రోగులకు అందిన సేవలు అద్భుతం. ప్రధానంగా సచివాలయ వ్యవస్థ నిర్మాణం, దాని ద్వారా అందిన సేవలను వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వాల ప్రతినిధులు వచ్చి ప్రత్యేకంగా అధ్యయనం చేశారు. వివిధ దేశాలకు చెందిన వారు అభినందనలు కురిపించారు. వీటికి అనుబంధంగా వలంటీర్లు ఉండడంతో ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ ఫలాలు ప్రజల ఇంటి వద్ద గడపలకే వచ్చి చేరాయి. 54 రకాల సేవలు నిరంతరాయంగా అందాయి. చివరకు భూముల రిజిస్ట్రేషన్లు కూడా ఇక్కడ మొదలు పెట్టారు.
- రైతులకు ఆర్‌బీకేల ద్వారా మేలైన సేవలు అందాయి. తమ గ్రామంలోనే ఉన్న రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) వ్యవస్థతో రైతులు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలతోపాటు పంటకు సాంకేతిక సహకారం, ధాన్యం కొనుగోలు, సాగు యాజమాన్య పద్ధతులు వంటివి పొందారు. వీటి ద్వారానే ధాన్యం కొనుగోలు పెద్ద ఎత్తున జరిగింది. కూటమి ప్రభుత్వం సైతం వీటి ద్వారానే కొనుగోలు చేస్తోంది. ఉచిత పంటల బీమా, నష్ట పరిహారం, పంట బీమా పరిహారం ఇలా అన్ని ఆర్‌బీకేల ద్వారా రైతులకు పెద్ద కష్టం లేకుండా అందాయి.
- విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా సమీపంలోనే మెరుగైన ఆరోగ్యం పొందగలిగారు. గ్రామంలో చిన్నచిన్న రోగాలకు మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీలకు వెళ్లకుండా గ్రామంలో వైద్యం అందించాలనే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేశారు. గతంలో 104 ద్వారా సేవలందించేవారు. హెల్త్ క్లినిక్‌లు పెట్టడం వల్ల స్థానికంగా వైద్య సదుపాయాలు పెరిగాయి. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు అందుబాటులో ఉండేవారు. జగనన్న సురక్ష ద్వారా వేలాది మంది రోగులకు ఉచిత ఓపీ, ఉచిత మందులు, కళ్లజోళ్లు అందాయి.
- సచివాలయాల ద్వారా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పట్టాదారు పాస్ పుస్తకం, పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, హౌసింగ్ లోన్‌లు, ఓటర్ ఐడీలు, 1బీలతో పాటు మరెన్నో సేవలు అందేవి. ఆధార్ అప్‌డేట్ సచివాలయాల్లో అందుబాటులో ఉండేవి. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సచివాలయాల్లో ప్రతీ రోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించేవారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ పథకాలు, ధ్రువీకరణ పత్రాలు, సేవలన్నీ ప్రజల ముంగిటకే చేరేవి.



అంబాజీపేట మండలం ముక్కామల పీహెచ్‌సీ వద్ద వైద్యసేవకు ఎదురుచూపులు

నేడు

వలంటీర్ వ్యవస్థ రద్దు



పింఛన్ల కోసం ఎదురు తెన్నులు: ఎన్నికల సమయంలో వలంటీర్ సేవలు నిలిపివేయడంతో గత ఏడాది ఏప్రిల్ నెలలో ఉప్పలగుప్తం మండలం వానపల్లిపాలెం సచివాలయం వద్ద పింఛన్‌దారుల పడిగాపులు (ఫైల్)

ఇంటింటికీ వచ్చి గడప వద్దనే సంక్షేమ పథకాలు లబ్ధి అందేలా చేసి ఒకటో తేదీ తెల్లవారు జామున పింఛన్ చేతికి అందించిన వలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. ఎన్నికల ముందు నుంచి ఒక పథకం ప్రకారం వలంటీర్లపై వ్యక్తిగత దాడి చేసిన టీడీపీ, జనసేన పార్టీల అధినేతలు ఎన్నికల ముందు వారికి మాత్రం నెలకు రూ.పది వేల గౌరవ వేతనం అందజేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఒక నెల రోజులు కూడా వారిని విధులు నిర్వహించనీయలేదు. మొత్తం వ్యవస్థను రద్దు చేశారు. దీనివల్ల పల్లెలు, పట్టణాల్లో సామాన్యులకు గడప వద్ద అందే సేవలు నిలిచిపోయాయి. వలంటీర్లు పింఛన్లు అందించడం ఒక్కటే కాకుండా కరోనా సమయంలోనూ, వరదల సమయంలో అందించిన సేవలు నిరుపమానం. ఇప్పుడు ఆ వ్యవస్థే నిలిచిపోవడంతో మొత్తం సేవలు స్తంభించినట్టయ్యింది.

సచివాలయంలో సేవలకు మంగళం



పలు దేశాలలో ప్రశంసలు అందుకున్న సచివాలయ వ్యవస్థ ద్వారా అందే పలు సేవలు నిలిచిపోయాయి. సచివాలయంలో రెవెన్యూ సేవలు, మ్యూటేషన్ వంటి ప్రక్రియ అందుబాటులో ఉండేది. భూముల క్రయ విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా సచివాలయాల్లో మొదలు పెట్టారు. తరువాత ఈ సేవలు నిలిచిపోయాయి. సచివాలయ ఉద్యోగులు పింఛన్ల పంపిణీకి, పన్నుల వసూలుకు మాత్రమే పరిమితమయ్యారు.

అప్పటి సేవలు ఇప్పుడు లేవు



అప్పట్లో ఫ్యామిలీ డాక్టర్ పేరుతో వైద్య సేవలు అందుబాటులో ఉండేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. చిన్న చిన్న అనారోగ్య సమస్యలకు సైతం పీహెచ్‌సీలు, పెద్ద ఆస్పత్రులకు వెళ్లాల్సిందే. ప్రభుత్వం గతంలో చేసినట్టుగా ఇంటి వద్దనే వైద్య సేవలు, మందులు అందేలా చేయాలి.

– పోతుల చంద్రావతి, కొత్తపేట

ఆర్‌బీకేలను మరింత పటిష్టం చేయాలి



రైతు భరోసా కేంద్రాల ద్వారా అందే సేవలపై సన్న, చిన్న కారు రైతులు ఎక్కువగా ఆధారపడుతున్నారు. వరదలకు, భారీ వర్షాలకు పంట నష్టపోతే ఒకటి రెండు రోజుల్లోనే ఆర్‌బీకేల సిబ్బంది వచ్చి పంట నష్టం నమోదు చేసేవారు. నాలుగైదు నెలల్లో పరిహారం వచ్చేలా చూసేవారు. మాకు పెద్దగా పని ఉండేది కాదు.

– పినిశెట్టి నాగబాబు, మామిడికుదురు

ఆధార్ అప్‌డేట్ కోసం ఇబ్బందులు పడుతున్నా..



ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలంటే నానా ఇబ్బందులు పడుతున్నాం. గత ప్రభుత్వం సచివాలయాల ద్వారానే ఆధార్ అప్‌డేట్ సేవలు అందించేది. అన్ని రకాల సేవలు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలంటే పోస్టాఫీసుకు వచ్చి నమోదు చేయించుకోవల్సి వస్తోంది. ఇక్కడకు వచ్చాక సర్వర్ డౌన్ వంటి సమస్యలు ఎదురవుతున్నాయి.

– సరెళ్ల వెంకట్రావు, మాజీ ఉప సర్పంచ్, జి.అగ్రహారం, అంబాజీపేట మండలం

నేడు సీఎం చంద్రబాబు రాక



సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావు, ప్రభుత్వ విప్ సుబ్బరాజు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకటేష్ తదితరులు

ముమ్మిడివరం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం ముమ్మిడివరం, కాట్రేనికోనలో పర్యటనకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 12.50 గంటలకు హెలికాప్టర్‌లో సీహెచ్ గున్నేపల్లి చేరుకుంటారు. అక్కడి నుంచి 1.05 గంటలకు కాట్రేనికోన మండలం చెయ్యేరులో ఉపాధి హామీ పథకంలో చెరువు పూడిక తీత పనులను పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడతారు.అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు సామాజిక పింఛన్ల పంపిణీ చేయనున్నారు. అదే గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ప్రజలతో ముఖాముఖీ ఉంటుంది. అక్కడే జిల్లాకు సంబంధించి బంగారు కుటుంబం కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం సీహెచ్ గున్నేపల్లిలో 3.35 గంటలకు పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు పాల్గొంటారు. 5.15 గంటలకు సీహెచ్ గున్నేపల్లి హెలీప్యాడ్ నుంచి తిరుగు ప్రయాణం కానున్నారు. కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావు, చంద్రబాబు పర్యటన కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగంలో ఏడుగురికి స్థానం

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర పార్టీ యువజన విభాగంలో జిల్లా నుంచి ఏడుగురికి స్థానం లభించింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం రాత్రి నియామక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా కాండ్రేగుల సీహెచ్. అచ్యుత రామరెడ్డి (పి.గన్నవరం నియోజకవర్గం), రాష్ట్ర కార్యదర్శిగా కటకంశెట్టి విజయధర్మ ఆదిత్యకుమార్ (రాజోలు నియోజకవర్గం), అఫీషియల్ స్పోక్స్‌మెన్‌గా ఉంగరాల సంతోష్ (ముమ్మిడివరం నియోజకవర్గం), సంయుక్త కార్యదర్శులుగా దంతులూరి రోహిత్ వర్మ (అమలాపురం నియోజకవర్గం), దియ్యాన పెదకాపు చొప్పెల్ల (కొత్తపేట నియోజకవర్గం), అక్కల శ్రీధర్ (ముమ్మిడివరం నియోజకవర్గం), వాసిరెడ్డి అర్జున్ (మండపేట నియోజకవర్గం) నియమితులయ్యారు.

సినిమా థియేటర్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

- 3 థియేటర్లకు నోటీసులు జారీ
- ఫుడ్ అండ్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీకాంత్ చౌదరి



అమలాపురంలో రమా థియేటర్‌కు ఫుడ్ లైసెన్స్ లేనట్లు గుర్తించి నోటీసు జారీ చేస్తున్న ఫుడ్ అండ్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీకాంత్ చౌదరి

అమలాపురం టౌన్: స్థానిక సినిమా థియేటర్లపై మొదటి రెండు రోజులూ రెవెన్యూ అధికారులు ఆకస్మిక దాడులు చేసి మౌలిక సదుపాయాలు, తినుబండారాల విక్రయాలు, వాహనాల పార్కింగ్, మరుగుదొడ్ల నిర్వహణపై వరస తనిఖీలు చేశారు. తాజాగా ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు శుక్రవారం థియేటర్లపై ఆకస్మిక దాడుల చేసి తినుబండారాల దుకాణాలను తనిఖీలు చేసి ఆహార పదార్థాల నిర్వహణ సక్రమంగా లేదని నోటీసులు జారీ చేశారు. ఫుడ్ అండ్ సేఫ్టీ ఆఫీసర్ పి.శ్రీకాంత్ చౌదరి ఆధ్వర్యంలో ఆహార భద్రత అధికారులు ఈ దాడులు చేశారు. స్థానిక రమా, వీపీసీ, శేఖర్ థియేటర్లను అధికారుల బృందం తనిఖీలు చేసింది. ఆయా థియేటర్లకు ఫుడ్ లైసెన్స్‌లు లేనట్లు గుర్తించి నోటీసులు ఇచ్చారు. పని చేసే సిబ్బందికి ఫిజికల్ ఫిటెనెస్ చేయించాలని, ఆయా థియేటర్ల అధికారులు సూచించారు. పరిశుభ్రమైన ఆహారాన్ని నిర్ధేశించిన ధరలకే విక్రయించాలన్నారు. గడువులోపే థియేటర్లలో ఫుడ్ లైసెన్స్‌లు రెన్యూవల్ చేయించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాకా సరే.. బకాయిల మాటేమిటి?

- నేడు జిల్లాకు సీఎం చంద్రబాబు రాక
- సామాజిక పింఛన్ల పంపిణీ అంటూ ప్రచార ఆర్భాటం
- ఉపాధి కూలీలకు నెలల తరబడి అందని వేతనాలు
- గోకులాల షెడ్ల పెండింగ్ నిధులు మంజూరు కాని వైనం
- జిల్లాలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మొత్తం బకాయిలు రూ.110.90 కోట్లు

ఆలమూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన మండలం చెయ్యేరులో శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారిక పర్యటన ఖరారైంది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద చేపట్టనున్న పనులను ప్రారంభించడంతో పాటు సామాజిక పింఛన్లను పంపిణీ చేస్తారని అధికార యంత్రాంగం గొప్పగా ప్రచారం చేస్తోంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద ఉపాధి కూలీలకు కాని, పాడిరైతులకు గాని న్యాయం చేయడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఎన్‌ఆర్‌జీఈఎస్‌లో పనిచేస్తున్న కూలీలకు రెండు నెలల నుంచి రూ.కోట్లలో వేతన బకాయిలు ఉన్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. సీఎం చంద్రబాబు పర్యటన ఉన్నందున ఇప్పటికైనా అధికారులు వేతనాలు మంజూరు చేస్తారని ఎదురు చూసిన కూలీలకు నిరాశే ఎదురైంది. వ్యవసాయ కార్మిక సంఘాలు, సామాజిక వేత్తలు ప్రభుత్వ నిర్లక్ష వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అంతటా అసహనం

పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేసేందుకు ఎన్‌ఆర్‌జీఈఎస్ దోహదపడుతుందంటూ రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న తీరుకు క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు తీవ్ర వ్యత్యాసం కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ఇంకా సక్రమంగా చెల్లింపులు లేక గ్రామాల్లోని అభివృద్ధి ఎండమావిగా మారింది. ఉపాధి హామీ ద్వారా నిర్ణీత సమయానికి ఇప్పటి వరకూ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం, రైతులకు రాయితీలను అందించకపోవడం, ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లింపులపై దృష్టి సారించకపోవడంపై అంతటా అసహనం వ్యక్తమవుతోంది. ఎన్‌ఆర్‌జీఈఎస్ ద్వారా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక అవి అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో అసంపూర్తి భవనాలు ప్రజా ప్రతినిధులను వెక్కిరిస్తున్నాయి. జిల్లాలోని 22 మండలాల్లో 385 గ్రామాల్లో 2,31,116 జాబ్‌కార్డులు ఉండగా అందులో 1.59 లక్షలు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ 5.42 లక్షల మంది కూలీలు ప్రభుత్వం మంజూరు చేసిన 2,385 పనులకు సంబంధించి సుమారు 63.48 లక్షల పని దినాలు పనిచేశారు. వీరందరికి 2025 మే 30 నాటికి ఎన్‌ఆర్‌జీఈఎస్ శాఖ సుమారు రూ.28.87 కోట్లు బకాయిలు చెల్లించవలసి ఉందని ప్రభుత్వ గణాంకాలను బట్టి తెలుస్తోంది.



అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద ఉపాధి కూలీలకు వేతనాలు మంజూరు కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘాల ధర్నా (ఫైల్)



ఆలమూరులో చెరువు పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

ఉపాధి కూలీల ఆకలి కేకలు

ఆరుగాలం కష్టించి పనిచేసిన ఉపాధి కూలీలకు వేతనాలు సక్రమంగా అందక అర్ధాకలితో అలమటిస్తున్నారు. వేతనాలను మంజూరు చేయాలని కోరుతూ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకునే నాథుడు లేడంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కూలీల రోదనను, ఆకలి కేకలను ప్రభుత్వం పట్టించుకోదా అంటూ అధికారులను నిలదీస్తున్నారు. అధికారంలోకి రాగానే కూటమి నేతలు ఆగమేఘాల మీద ఎన్‌ఆర్‌జీఈఎస్, పశుసంవర్ధకశాఖ అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చి నిర్మించిన గోకులాల(పశువుల షెడ్ల)కు ఆరు నెలలైనా బిల్లులు మంజూరు కాలేదు. బిల్లులు వేగంగా అందిస్తామన్న హామీతో అప్పులు చేసి మరీ పనులు చేస్తే నెలలు తరబడినా మంజూరు కాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు.

ఇదీ లెక్క..

జిల్లాలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ జాబ్‌కార్డులు : 2.31 లక్షలు

వాడుకలో ఉన్న జాబ్‌కార్డులు 1.59 లక్షలు

ఉపాధి పనుల్లో పాల్గొన్న కూలీలు 5.42 లక్షలు

జిల్లాలో కూలీల పనిదినాలు 63.48 లక్షలు

వేతన బకాయిలు : రూ.28,87 కోట్లు

జిల్లాలో మంజూరైన గోకులాలు (పశువుల షెడ్లు)	1,150
ఇప్పటి వరకూ రైతులు నిర్మించుకున్న గోకులాలు	880
లబ్ధిదారులకు మంజూరు చేయాల్సిన నిధులు	రూ 7.11 కోట్లు
జిల్లాలో ఇప్పటి వరకూ నిర్మించిన సీసీ రోడ్లు	1,098 కి.మీ
కాంట్రాక్టర్లకు చెల్లించవలసిన బిల్లులు	74.82 కోట్లు

ఉపాధి బకాయిల కోసం సీఎం చంద్రబాబును కలుస్తాం



జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలకు బకాయి పడ్డ వేతనాల మంజూరు కోసం సీఎం చంద్రబాబును కోనసీమ పర్యటనలో కలుస్తాం. ఎన్‌ఆర్‌జీఈఎస్‌ను నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు ఉండటంపై కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నందున ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. పనులు లేని కాలంలో ప్రతి వ్యవసాయ కార్మికుడి ఖాతాలో రూ.ఆరు వేలు వేస్తామన్న హామీపై నిలదీస్తాం.

– కారెం వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు, అమలాపురం

క్లుప్తంగా

బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన సీఐ


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: పట్టణ పరిధిలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో బుధవారం సంత మార్కెట్ సెంటర్‌లో ఒక బాలుడు సెల్‌ఫోన్ చూస్తూ నడుచుకొంటూ వెళ్లిపోతున్నాడు. దానిని గమనించిన సీఐ ఎ.కృష్ణభగవాన్ బాలుడి నుంచి వివరాలు సేకరించడానికి ప్రయత్నం చేశారు. అయితే ఆ బాలుడు మూగవానిగా తెలుసుకున్నారు. దాంతో సెల్‌ఫోన్‌లో నంబర్‌కు ఫోన్ చేయడంతో ఆ బాలుడిని వేదాంశ్ కార్తికేయగా గుర్తించారు. సీఐ సమాచారం మేరకు తల్లి పోతుల తులసీ, తండ్రి శరత్‌కుమార్ ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. తాము విశాఖపట్నం నుంచి వేసవి సెలవుల కారణంగా కోట్లమ్మ చెరువు వద్ద బంధువుల ఇంటికి వచ్చామని తెలిపారు. రెండో తరగతి చదువుతున్న ఆరేళ్ల తమ కుమారుడు వేదాంశ్ కార్తికేయ సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడుకొంటూ బయటకు వచ్చేయడాన్ని తాము గమనించలేదని చెప్పారు. క్షేమంగా తమ కుమారుడిని అప్పగించినందుకు బాలుడి తల్లిదండ్రులు సీఐకి, పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

మూల్యం తప్పదా..?!

- అప్రమత్తతపై అలక్ష్యం
- చాపకింద నీరులా విస్తరిస్తున్న కోవిడ్
- నానాటికీ పెరుగుతున్న కేసులు
- నివారణ చర్యలకు తిలోదకాలు
- కాకినాడ జిల్లాలో పరీక్షలు కేవలం జీజీహెచ్‌లోనే
- ముందు జాగ్రత్త చర్యలు లేవు
- అవగాహనా కార్యక్రమాలకు చెల్లుచీటి


జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డులో చికిత్స పొందుతున్న కోవిడ్ బాధితులు

కాకినాడ క్రైం: ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి చాలా రోజుల తర్వాత తనకు ఎదురైన తన స్నేహితుడిని ఆప్యాయంగా హత్తుకున్నాడు. ఆ వ్యక్తి అయ్యో ఎందుకిలా చేశావు, నాకు కోవిడ్ పాజిటివ్ వచ్చింది అని చెప్పాడు. కంగుతినడం ఈయన వంతైంది.

- మూడు రోజులుగా జలుబు, గొంతు నొప్పితో బాధపడుతున్న ఓ వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌కి మహాలక్ష్మీనగర్ నుంచి వచ్చాడు. వైద్యులకు చూపిస్తే పరీక్షకు సిఫారసు చేశారు. కోవిడ్ అని తేలింది. జాగ్రత్తలు చెప్పడంతో పాటు ఇప్పటి వరకు ఎందుకు వైద్యం చేయించుకోలేదని వైద్యులు అడిగారు. తన భార్య, కుమారుడు రోజు సపర్యలు చేస్తున్నారని, తనతోనే ఉంటూ నిద్రపోయే వేళ కూడా చెరో వైపు పడుకొని నీరసించిన తనని చాలా బాగా దగ్గరుండి మరీ చూసుకుంటున్నారని చెప్పాడు. అందుకే ఆసుపత్రికి రావాలని కూడా అనుకోలేదని సమాధానమిచ్చాడు. అతడి సమాధానంతో వైద్యులు తలలు పట్టుకున్నారు.
- జీజీహెచ్‌లోనే పనిచేస్తున్న ఓ ఉద్యోగి కోవిడ్ సోకిందని తెలిసినా రోజువారీ విధులకు హాజరవుతున్నాడు. సహోద్యోగులతో కలిసి మాట్లాడుతూ, తిరుగుతూ సాధారణ జీవితాన్ని గడిపేస్తున్నాడు.

ఇదీ జిల్లాలో కోవిడ్ బాధితుల పరిస్థితి. తమ స్థితి ఏంటన్న కనీస అవగాహన కూడా వారికుండడం లేదు. ముంచుకు రానున్న ప్రమాదం పట్ల అవగాహన కల్పించే ఆలోచన అయినా ప్రభుత్వానికి లేదు.

మాస్క్ లేదు, శానిటైజేషన్ లేదు, మందులు లేవు, పరీక్షలు లేవు, నోడల్ బృందాలు లేవు, అవగాహన, అప్రమత్తత అసలే లేవు. సామాజిక దూరం లేదు, సామన్యుడి పట్ల బాధ్యత లేదు.... ఇదీ ప్రభుత్వం ప్రజల పట్ల వ్యవహరిస్తున్న తీరు. జిల్లాలో కోవిడ్ వ్యాప్తి చాపకింద నీరులా ఉంది. ఈ విషయం ప్రభుత్వానికి ఆరోగ్యశాఖ ద్వారా తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. కోవిడ్ అంటే పట్టనట్లే ప్రభుత్వం వ్యవహరిస్తుండడం ప్రజల్లో గుబులు రేపుతోంది. ప్రభుత్వమే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే జనబాహుళ్యంలో అవగాహన లేని వర్గాల పరిస్థితి ఏంటన్న ప్రశ్న తలెత్తుతోంది. అవగాహన, అప్రమత్తతపై శాఖలకు కనీస ఆదేశాలు జారీ చేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. కేసులు నానాటికీ పెరుగుతున్నాయన్న అంతర్గత నివేదికల ఫలితమో ఏమో గురువారం నుంచి మాత్రం నివేదికలు పంపాలని ఆదేశాలు జారీ చేసింది.

ఎల్‌ఎఫ్–7 వేరియంట్

తాజా వేరియంట్ పేరు ఎల్‌ఎఫ్–7. ఈ వేరియంట్ ఒమిక్రాన్ లైనేజ్ జేఎన్.1 నుంచి ఉద్భవించింది. ప్రస్తుతం వస్తున్న నమూనాలలో ఈ వేరియంట్ జాడలే ఉన్నాయని మైక్రోబయాలజీ నిపుణులు చెబుతున్నారు.

ప్రమాదం కాదంటూనే...

ఎల్‌ఎఫ్–7 వేరియంట్ల వల్ల ప్రమాదం లేదంటూనే గర్భిణిలు, బాలింతలు, వయో వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ప్రాణానికి కోవిడ్ వైరస్ వల్ల ప్రమాదం వాటిల్లవచ్చని హెచ్చరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

కనీస ఏర్పాట్లు శూన్యం

విస్తరిస్తున్న కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు ఎటువంటి కనీస ఏర్పాట్లు లేవు. కోవిడ్ వ్యాక్సిన్ జిల్లాలో లేదు, టెస్టుల నిర్వహణకు కిట్లు లేవు. యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీల స్థాయిలో పరీక్షల నిర్వహణ, నిర్ధారణ అయిన వారికి చికిత్స అందించేందుకు ప్రభుత్వం ఎటువంటి ఏర్పాట్లు చేయలేదు. మందుల కొరత కూడా ఉంది. మాస్కులు, శానిటైజర్ల వినియోగంతో పాటు కోవిడ్ అప్రమత్తతపై ఎటువంటి అవగాహన సదస్సులు, కార్యక్రమాలు కాదు కదా కనీసం కరపత్రాల పంపకం అయినా లేదు. కోవిడ్ నిర్వహణకు నోడల్ అధికారి నియమాకం కూడా జిల్లాలో లేదు. ఇందుకు ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖకు ఎటువంటి ఆదేశాలు జారీ చేయకపోవడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది.

జీజీహెచ్‌లో మాత్రమే కోవిడ్ పరీక్షలు

జిల్లావ్యాప్తంగా కాకినాడ జీజీహెచ్‌లో తప్ప మరెక్కడా కోవిడ్ పరీక్షలు జరగడం లేదు. స్థానిక ఆరోగ్య కేంద్రాలైన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు (యూపీహెచ్‌సీ), ప్రైమరీ హెల్త్ సెంటర్లు (పీహెచ్‌సీ)లో పరీక్షలు నిర్వహించడం లేదు. కనీసం ర్యాపిడ్ పరీక్షలు కూడా స్థానిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించకపోవడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. కోవిడ్ అనుమానం ఉంటే జిల్లాలో ఏ మూల ఉన్నా కాకినాడ జీజీహెచ్‌కు రావలసిందే.

మూడు రోజుల్లో 10 మందికి..

కేవలం కాకినాడ జీజీహెచ్‌లోనే మూడు రోజుల్లో 10 మందికి కోవిడ్ నిర్ధారణ అయింది. వీరిలో ముగ్గురు ఇన్‌పేషెంట్లుగా కోవిడ్ ప్రత్యేక వార్డులో ఉండి చికిత్స పొందుతున్నారు. ఐపీలో చేరిన వారిలో 13 ఏళ్ల బాలుడు కూడా ఉండడం గమనార్హం. అలాగే, ఓపీలో గడచిన మూడు రోజులుగా నిర్వహించిన పరీక్షల్లో ఏడు గురికి కోవిడ్ నిర్ధారణ అయిందని, అయితే వారంతా ఓపీ రోగులు కావడంతో ఇళ్లకు వెళ్లిపోయారని ఆసుపత్రి వర్గాల సమాచారం. ఆందోళన కలిగించే విషయం ఏంటంటే ఓపీలో కోవిడ్ నిర్ధారణ అయిన వారిలో ఏ ఒక్కరూ జీజీహెచ్‌లో చికిత్స పొందలేదు. వారు ఎక్కడికి వెళ్లారో ఏమయ్యారో అధికారుల్లోనూ స్పష్టత లేదు. వారి ద్వారా వ్యాప్తికి అవకాశం ఉన్నా ఆ దిశగా ఏ మాత్రం చర్యలు లేవు. పరిస్థితిని అధికారుల వద్ద ప్రస్తావిస్తే ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు లేవని చెబుతున్నారు.

కోల్డా... కోవిడా...

ప్రజల్లో చాలామంది ఈ మధ్య కాలంలో జలుబు, గొంతు సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. కోల్డా(జలుబా) లేదా కోవిడ్ సోకిందా...! ఏదీ తేల్చుకోలేకపోతున్న గందరగోళ స్థితి ప్రజల్లో నెలకొంది. అందుకు కారణం, కోవిడ్ చాపకింద నీరులా మళ్లీ పురివిప్పుతున్న ప్రమాదకర స్థితి ఓ వైపు అయితే, వాయుగుండ ప్రభావంతో వాతావరణంలో చోటు చేసుకుంటున్న అసాధారణ మార్పులు ఇంకో వైపు. దీంతో గందరగోళంతో తాము ఏ స్థితిలో ఉన్నామో కూడా తెలుసుకోలేక పోతున్నారు. పోనీ పరీక్ష చేయించుకుందాం అనుకుంటే దగ్గర్లో టెస్టింగ్ సెంటర్లేవీ ఉండడం లేదు. దీంతో వైరస్ సోకిన వారే తమకు తెలియకుండా తామే వాహకాలుగా తయారవుతున్నారు.

జమైకా హ్యాపిల్!


గులాబీరంగు పుప్పొడులు చెట్టు నుంచి పడి ఇలా తివాచీలా..


చెట్టుకు కాసిన జమైకన్ ఆపిల్ కాయలు

యానాం: కరేబియన్ దీవులలో వెస్టిండీస్ సమీపంలోని జమైకా ద్వీప దేశంలో జమైకా ఆపిల్‌గా పిలిచే చెట్టు యానాం పట్టణంలో ఓ గృహంలోని పెరట్లో వందలాది కాయలతో విరగకాస్తుండటంతో పలువురిని ఆకర్షిస్తోంది. దీంతో పలువురు 20 అడుగుల ఎత్తులో ఉన్న ఆ చెట్టును చూస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక బాలయోగి కాలనీలో కేతా ఫణి, జగదాంబకు చెందిన గృహంలో 15 ఏళ్ల క్రితం నాటిన జమైకా ఆపిల్ చెట్టు ఉంది. దీనికితోడు ఆ మొక్క పూలనుంచి ఎర్రని పుప్పొడులు కిందికి పడటంతో చెట్టుకింద ఎర్రని తివాచీగా పరచినట్టు ఉంది చూపరులను ఆకర్షిస్తోంది. చూసేందుకు వాటర్‌యాపిల్‌లా ఉన్నప్పటికీ రుచి కమ్మగా ఉంటుంది. జమైకా ఆపిల్ వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని స్థానిక వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. కాల్షియం, ఫాస్పరస్ వంటి ఖనిజాలతో సమృద్ధిగా ఉన్న జమైకా ఆపిల్ బలమైన ఎముకలు, దంతాలను నిర్మించడంలో సహాయపడుతుందని తెలిపారు.

ఇసుక లారీల వేగాన్ని నియంత్రించాలంటూ ధర్నా


వెంకటాయపాలెంలో లారీలను అడ్డుకుని ధర్నా చేస్తున్న నాయకులు, ప్రజా సంఘాలు, ప్రజలు

రామచంద్రపురం రూరల్: ప్రమాదాలకు కారణమవుతున్న ఇసుక లారీల వేగాన్ని నియంత్రించాలని కోరుతూ వెంకటాయపాలెం, వేగాయమ్మపేట గ్రామాల సర్పంచ్‌లు, ప్రజలు, అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఇసుక లారీలను అడ్డగించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటాయపాలెం గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధ్యక్షురాలు యల్లమిల్లి సతీష్‌కుమారి, వేగాయమ్మపేట సర్పంచ్ అంబటి తుకారం, రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి గోదావరి జిల్లాల నాయకుడు వెంటపల్లి భీమశంకరం, ఐఎఫ్‌టీయూ నాయకుడు చింతా రాజారెడ్డి తదితరులు మాట్లాడుతూ లారీలు, ముఖ్యంగా ఇసుక లారీలు మితిమీరిన వేగంతో వెళుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని మండి పడ్డారు. ఈ నెల 28న మహిళపై నుంచి లారీ వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఉదంతాన్ని గుర్తు చేసుకున్నారు. ఆమె మృతితో అప్పటికే తండ్రిని కోల్పోయిన ఇద్దరు చిన్నారులు తల్లిని కూడా కోల్పోయి అనాథలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటాయపాలెం ప్రధాన రహదారి నుంచి వేగాయమ్మపేట, యర్రపోతవరం, యానాంలకు దగ్గరి దారిగా ఉండటంతో చీమలదిబ్బ గ్రామం నుంచి కాలువ గట్టు రహదారిపై నుంచి లారీలు రాకపోకలు సాగించడం ప్రమాదాలకు కారణమవుతోందన్నారు. ఈ రహదారి ఇరుకుగా ఉండటం రెండు పక్కలా కాలువలు ఉండటంతో అధిక బరువు కలిగిన లారీల వల్ల రోడ్డు కూడా కుంగిపోయి మరింత ప్రమాదకరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక లోడులు వేస్తున్న ఇసుక లారీలకు కనీసం బరకాలు కూడా కప్పకపోవడంతో లారీల వేగానికి ఇసుక ఎగిరి ప్రయాణికుల కళ్లల్లో పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. ఆర్‌అండ్‌బీ అధికారులు లారీల వేగాన్ని నియంత్రించేలా స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, చీమలదిబ్బ దారిలో లారీలు సంచరించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుసూరి వెంకటరమణ, ఇళ్ల సత్యనారాయణ, రాయుడు కృష్ణ, కోడి అర్జునుడు, ఇళ్ల గణపతి, అనుసూరి దుర్గ, దంగేటి జ్యోతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దడాల రవికుమార్ పాల్గొన్నారు.

చెరువు గుటాక్కయస్వాహా!

- బియ్యపుగుంట చెరువును పూడ్చేసిన ఆక్రమణదారులు
- అధికార పార్టీ నాయకుల అండదండలతోనే
- పట్టించుకోని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు


ఆక్రమణదారులు పూడ్చివేసిన బియ్యపుగుంట చెరువు

నిడదవోలు: ఆక్రమణకు కాదేది అనర్హం అన్నట్లు కొందరు రెచ్చిపోతున్నారు. ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపిస్తుందా.. పాగా వేసేద్దామా అంటూ ఎదురుచూస్తున్నారు. అధికార పార్టీ అండదండలు ఉండడంతో ఆక్రమణదారులకు అడ్డు అదుపూ లేకుండాపోతోంది. ఆక్రమణలపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు చీమకుట్టినట్లు కూడా ఉండడం లేదు. దీనికి తాజా ఉదాహరణగా నిడదవోలులోని బాలాజీనగర్‌లో మున్సిపాలిటికి చెందిన బియ్యపుగుంట చెరువును ఆక్రమణదారులు పూడ్చివేశారు. బుధవారం రాత్రికి రాత్రే లారీలతో మంటి తరలించి 80 సెంట్ల ఉన్న చెరువును పూడ్చివేశారు. దీని విలువ రూ.4 కోట్ల వరకు ఉంటుంది. రెండేళ్ల క్రితం మున్సిపల్ అధికారులు చెరువు విస్తీర్ణాన్ని కొలిచి సరిహద్దు స్తంభాలను కూడా ఏర్పాటు చేశారు.

విలువైన భూమి

పట్టణ శివారున బాలాజీనగర్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారంజోరుగా సాగుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు రైతుల నుంచి పొలాలు కొని వెంచర్లు వేసి అధిక ధరలకు విక్రయించి లాభపడుతున్నారు. ఈ ప్రాంతంలో మున్సిపాలిటీకి చెందిన 80 సెంట్ల బియ్యపుగుంట చెరువుపై అక్రమార్కుల కన్ను పడింది. ఇక్కడ గజం భూమి రూ.10 వేలు పలుకుతోంది. సెంటు భూమి సుమారు 4.80 లక్షలు అయితే 80 సెంట్ల భూమి విలువ సుమారు రూ.4 కోట్లు పలుకుతోంది. రైతులకు ఈ చెరువు ఎంతో ఉపయోగంగా ఉండేది. ఎక్కువగా చాగల్లు మండలం ధారవరం, బ్రాహ్మణగూడెం గ్రామాలకు చెందిన రైతులకు చెందిన 300కి పైగా పశువులు చెరువులో దాహం తీర్చుకునేవి. సుమారు 50 ఎకరాలకు సంబంధించిన మురుగునీరు చెరువుకు చేరడంతో పొలాలకు నష్టం లేకుండా ఉండేది. అయితే చెరువును పూడ్చివేయడంతో వర్షపునీరు, పంట మురుగునీరు వెళ్లే దారిలేక భవిష్యత్‌తో పొలాలు ముంపునకు గురవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువులకు తాగునీరు కరువవుతుందని వాపోతున్నారు.


గతంలో మున్సిపాలిటీ అధికారులు వేసిన సరిహద్దు ఐరన్ పోల్


తహసీల్దారు నాగరాజు నాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

చర్యలు తీసుకోవాలని వినతి

ఆక్రమణ దారులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతూ నిడదవోలు తహసీల్దారు నాగరాజునాయక్, మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణవేణిలను శుక్రవారం రైతులు కలుసుకుని వినతిపత్రాలు అందజేశారు. మున్సిపాటిటీకి చెందిన భూములు ఆక్రమణలు గురికాకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. రికార్డుల్లో ఉన్న విస్తీర్ణాన్ని కొలిచి పూర్తి స్థాయిలో సరిహద్దులు ఏర్పాటు చేయాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

- 330 sq.yards plot with 6 feet width passage for sale in Jawahar St, Opp. CMR Jewellery Mall, Kakinada No. Brokers. 9949507969 [SCA-25004320]
- కాకినాడ, నాగమల్లితోట జంక్షన్ వద్ద పడమర ఫేసింగ్ 100 అడుగుల మెయిన్‌రోడ్‌ని ఆనుకుని 980 చ॥గ॥లు మరియు 846 చ॥గ॥లు కమర్షియల్ స్థలములు అమ్మకము నకు కలవు. ✆ : 92461 99099 [R-26]
- కాకినాడ ఈస్ట్ పాయింట్ కాలనీ నందు (సురేష్ నగర్, శశికాంత్‌నగర్‌ల నుండి VS Lakshmi College కి గల 100 అడుగుల రోడ్డు) తూర్పు వైపు 33 అడుగుల సి.సి.రోడ్డుని ఆనుకుని నూతనంగా నిర్మించిన పార్క్ ఎదురుగా, ఆదిత్య నర్సింగ్ కాలేజికి ముందు సౌత్ ఫేసింగ్ (40x60) కొలతలతో 266.66 చ॥గ॥ల చొప్పున 5 స్థలములు, పార్క్‌కి దక్షిణ వైపు 40 అడుగుల రోడ్డు ఆనుకుని నార్త్ ఫేసింగ్ (40x78) కొలతలతో 346.66 చ॥గ॥ల చొప్పున 5 స్థలములు అమ్మకమునకు కలవు. ✆ : 92461 99099 [R-25]

LAND FOR SALE

- కాకినాడ, నడకుదురు వద్ద శుభం కొంటి లే అవుట్‌నకు మరియు NH-216 బైపాస్ రోడ్డు దగ్గరగా ఇరువైపులా 7 ఎకరాలు మరియు 2 ఎకరాలు లే అవుట్‌లకు అనువైన భూమి అమ్మకమునకు కలదు. సంప్ర॥ 92461 99099 [R-30]
- సామర్లకోట RAK సిరామిక్స్ ఫ్యాక్టరీ ఎదురుగా ADB రోడ్‌నుండి 2వ బిట్ N/F రోడ్‌తో లేఅవుట్‌లకు, గొడౌన్‌లకు అనుకూలమైన 5.21 ఎకరాలు భూమి (జగ్గమ్మ గారి పేట నందు) అమ్మకము. సంప్ర॥ 92461 99099 [R-31]

Wanted

- కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15 వేలు -40వేలు.ఫ్రీరూం+భోజనం.Hyd.8317512135 [HA-15904]
- సికింద్రాబాద్ తాడ్‌బండ్ శ్రీహనుమాన్ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోసే క్యాషియర్స్ కావలెను. జీతం : 15000 రోజుకి 100 భత్త రూం ఫ్రీ. 9949822338 [SCA25004357]
- అనుభవం గల నర్సులు మరియు కంప్యూటర్ ఆపరేటర్ (Female) గా పనిచేయుటకు కావలెను. సంప్ర॥ ప్రగతి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ప్రకాష్‌నగర్, మెయిన్‌రోడ్, రాజమండ్రి [R-239]
- రామకృష్ణ ఓల్డేజ్ హోం TG No.1 Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు వంట/ఇంటి పనిబేబికేర్‌కు M/F వర్కర్స్ కా॥భో+వసతి+జీతం 16–18 వేలు ఫోన్: 9133271122/ 9515119430 [SCA25004282]
- రామకష్ణ ఓల్డేజ్ హోం (VJA బ్రాంచి) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషంట్ల సేవకు వంట / ఇంటిపని, బేబికేర్ కొరకు M/F వర్కర్స్, భో+వసతి+ జీతం: 16-18 వేలు, ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 63010 53690, 82475 00574 [B-1275560]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అంగన్‌వాడీ కార్యకర్త తొలగింపుపై నిరశన

- నాలుగు రోజులుగా ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు
- అస్వస్థతకు గురైన బాధితురాలు పద్మ
- ఆసుపత్రికి తరలించిన సహచరులు



శంఖవరం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేస్తూ సొమ్మసిల్లిన అంగన్‌వాడీ కార్యకర్త పద్మ


రౌతులపూడి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న పద్మ

శంఖవరం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని రౌతులపూడి మండలం రామకృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రంలో 12 ఏళ్లుగా కార్యకర్తగా పనిచేస్తున్న ఎం.పద్మను అక్రమంగా తొలగించి అదే గ్రామానికి చెందిన బీసీ డీ కులానికి చెందిన పాకిలా భవానీని విధుల్లోకి చేర్చుకోవడం అన్యాయమని ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ నెల 17 నుంచి ఆందోళనకు దిగారు. ఇప్పటి వరకు పనిచేసిన అంగన్‌వాడీ కార్యకర్తకు నోటీస్, రిలీవింగ్ ఉత్తర్వులు ఇవ్వకుండా మరొకరిని విధుల్లోకి ఎలా చేర్చుకుంటారంటూ నాలుగు రోజులుగా ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్నారు. బాధితురాలు పద్మ నాలుగు రోజులుగా ఆహారం సక్రమంగా తీసుకోకుండా శుక్రవారం దీక్షలో కూర్చుంది. దీక్షలో కూర్చున్న గంటలో తీవ్ర అస్వస్థకు గురైంది. ఆమెను 108 వాహనంలో అంగన్‌వాడీలు సీహెచ్‌సీకీ తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించారు.

అంగన్‌వాడీ కార్యకర్త పద్మకు పలువురి పరామర్శ

నిరాహార దీక్షకు పూనుకున్న అంగన్‌వాడీ కార్యకర్త ఎం.పద్మ అస్వస్థతకు గురవ్వడంతో శుక్రవారం పలువురు పరామర్శించారు. జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు శేషు బాబ్జి చికిత్స పొందుతున్న పద్మను పరామర్శించి ఆమె యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ అప్పటివరకు పని చేస్తున్న కార్యకర్తలనే కొనసాగించాలంటూ గత ప్రభుత్వం 2020 డిసెంబర్ 4వ తేదీన ఉత్తర్వులు విడుదల చేసిందని, అయినా అధికారులు ఈ జీవోన దాచిపెట్టి, ఈ నెల 16న కోర్టు ఆర్డర్ ఉన్నదంటూ మరో ఆమెను విధుల్లోకి చేర్చుకోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా అధికారులు పద్మను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు గెద్దం బుల్లమ్మ, బి.రత్నకుమారి, డి.సత్యవేణి, నూకరత్నం, రాజేశ్వరి పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

రాజమహేంద్రవరం రూరల్: స్వర్గీయ వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, యువ కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాల తిరుపతిరావు (అను), యువకాపునాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాలపోసికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పిఠాపురం ఉప్పాడ రోడ్డులో వంగవీటి విగ్రహం ధ్వంసం చేసిన వారిని తక్షణం అరెస్టు చేసి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వారిని కఠినంగా శిక్షించాలన్నారు. వంగవీటి మోహనరంగా పేదల పాలిట పెన్నిధి, ఆయన విగ్రహాలపై రాజకీయాలు చేయొద్దని, విధ్వంసం చేస్తే ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించాలన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ కౌన్సెలింగ్‌తో ఒక్కటైన దంపతులు


బడుగువానిలంకలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ చొరవతో ఒక్కటైన దంపతులతో కుటుంబ సభ్యులు

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో మూడేళ్ల క్రితం విడిపోయిన దంపతులు జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) చొరవతో ఒక్కటయ్యారు. స్థానికుల కథనం ప్రకారం బడుగువానిలంకకు చెందిన పాలూరి వెంకటేష్‌తో పెదపళ్లకు చెందిన దేవి గౌతమికి 2014 లో వివాహమైంది. మూడవ కాన్పులో ఆడపిల్ల పుట్టిందనే కారణంతో 2022 మార్చిలో దేవి గౌతమిని పిల్లలతో సహా భర్త వెంకటేష్ పుట్టింటికి పంపించి వేశాడు. అప్పట్లో పెద్దల వద్దకు, ప్రజా ప్రతినిధుల వద్దకు వెళ్లి కాపురాన్ని నిలబెట్టాలని వేడుకున్నా ఫలితం లేకపోయింది. ఇటీవల ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా ఆలమూరు మండలంలోని పెదపళ్లకు చెందిన గారపాటి శ్రీనివాసరావు నియమితులు కావడంతో దేవి గౌతమి ఆయనకు తన పరిస్థితి వివరించింది. దీనిపై స్పందించిన వైస్ చైర్మన్ గారపాటి భర్త వెంకటేష్ నివాసానికి వెళ్లి, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధుల సాయంతో కౌన్సెలింగ్ ఇచ్చి భార్యాభర్తలిద్దరితో పాటు కుటుంబ సభ్యులతో కలిసి కాపురానికి ఒప్పించడంతో కథ సుఖాంతమైంది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ కృషిని ఇరు గ్రామాల ప్రజలు అభినందించారు.

అమలాపురంలో తొలిసారిగా బాక్స్ క్రికెట్ పోటీలు


అమలాపురంలో తొలిసారిగా జరుగుతున్న బాక్స్ క్రికెట్ పోటీల పిచ్ (క్రికెట్ బాల్ బయటకు వెళ్లకుండా ఏర్పాటు చేసిన వలల వలయం)

అమలాపురం టౌన్: గుర్రాల విజయ కృష్ణ మెమోరియల్ పేరిట అమలాపురంలో మొట్టమొదటిసారిగా బాక్స్ క్రికెట్ పోటీలు స్థానిక గండువీధిలో ఈ నెల 28వ తేదీన మొదలయ్యాయి. జూన్ 3వ తేదీతో ఈ పోటీలు ముగిస్తాయని నిర్వాహకుడు కన్నా చెప్పారు. వారం రోజుల పాటు పోటీలను తమ సోదరుడి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నామన్నారు. మొదటి బహుమతిగా రూ.30 వేలు, రెండో బహుమతిగా రూ.15 వేలు ఇవ్వనున్నారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో మొత్తం 40 జట్లు తలపడనున్నాయన్నారు. ప్రతీ మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ట్రోఫీని విజేత జట్టుకు అందజేస్తున్నారు.